క్లుప్తంగా

సంతోషిమాతకు ప్రత్యేక కుంకుమ పూజలు



కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: భాద్రపద మాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని కె.జె.పురం జంక్షన్ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు, గోమాతకు పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాతలు సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక మోదమాంబ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఉచిత ఆటో సౌకర్యం కల్పించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు లాటరీ తీసి చీరలు, గొడుగులను బహుమతులుగా ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు అందించారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ



కేజే పురం కళావేదికపై మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న చిట్టినాయుడు

మాడుగుల రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు వినాయక మట్టి విగ్రహాలను పూజించాలని, కేజే పురం గ్రామ సర్పంచ్ జామి రమణబాబు కోరారు. గ్రామంలోని దుర్గాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పాలమరశెట్టి చిట్టినాయుడు, ఆయన మేనల్లుడు పెంటకోట నానిల ఆర్థిక సహకారంతో శుక్రవారం 1,500 వినాయక మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకులు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, కాళ్ల జగన్, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లి నాయుడు, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు సర్వే ప్రారంభం



డ్రోన్ మ్యాప్‌తో ఇంటింటి సర్వేలో సిబ్బంది

మాడుగుల: మండలంలోని సత్యవరం గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా శుక్రవారం సర్వే ప్రారంభించారు. డ్రోన్ మ్యాప్ ఆధారంగా ఇంటింటికీ వెళ్లి ఆస్తుల కొలతలు తీసుకుని, డాక్యుమెంట్ల ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తున్నారు. దీనిపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానికంగా ఇళ్లు ఉండీ, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారికి సమాచారం అందిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి రామారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ లింకు చేసుకోండి

రోలుగుంట: విద్యుత్ వినియోగదారులందరూ తమ విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని స్థానిక విద్యుత్‌శాఖ ఏఈ పద్మనాభం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ లింకు చేసుకునే ఆప్షన్ అందుబాటులో ఉందన్నారు. దీని అమల్లో భాగంగా వినియోగదారులంతా తమ ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని కోరారు.

రుణాల మంజూరులో జాప్యం వద్దు



సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ లక్ష్మీపతి

గొలుగొండ: బ్యాంక్‌ల నుంచి డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరు, రికవరీ విషయంలో జాప్యం చేయరాదని జిల్లా వైఎస్సార్ క్రాంతి పథం పీడీ లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం ఆయన గొలుగొండ కార్యలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో 1120 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న వీవోఏలు ఎప్పటికప్పుడు డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించి సభ్యుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఏపీఎం మంగ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

- క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు
- మండల స్థాయి క్రీడల ప్రారంభోత్సవంలో వక్తలు

చిన్నతనం నుంచే నుంచే క్రీడల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి. క్రీడల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు, పోటీతత్వం అలవడుతుందన్న స్పృహ కలిగించాలి. అందుకే ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏటా పలు క్రీడల్లో పాఠశాల విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తోంది. మూడు రోజులపాటు జరగనున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో పలు పాఠశాలల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు పోటీపడి తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.



కేజే పురం హైస్కూల్లో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో దేముడమ్మ, సర్పంచ్ రమణబాబు



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు



రావికమతంలో ఖోఖో పోటీల్లో విద్యార్థులు



దేవరాపల్లి హైస్కూల్లో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ సత్యం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మీ రమణమ్మ



క్రీడాపోటీల ప్రారంభం సందర్భంగా పావురాలను ఎగురవేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్



200 మీటర్ల పరుగు పందెంలో విద్యార్థులు



బాలికల జట్ల మధ్య కబడ్డీ పోటీ

దేవరాపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాలలో బాల బాలికలకు వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో మండలంలోని 11 పాఠశాలల నుంచి 297 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, త్రో బాల్, టెన్నీక్వాయిట్, అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించారు. ఈ పోటీలు శనివారం కూడా జరుగుతాయని ఇన్‌చార్జ్ ఎంఈవో-1, స్థానిక హెచ్‌ఎం బి.పడాల్‌దాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వి.ఉషారాణి, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ జి.వి.రమణ, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని, స్థానిక ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, కొరుపోలు శ్రీను, ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ బి.బాబురావు, తరుణ్, ఆర్.తమ్మునాయుడు, కె.సంతోష్, నాగేష్, ఏ.సూర్య ప్రకాష్ తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో బి.దేముడమ్మ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేజే పురం జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి క్రీడా పోటీలను స్థానిక సర్పంచ్ రమణబాబు, ఇతర నాయకులతో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు, చీడికాడలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మండలంలో 11 హైస్కూళ్ల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, యోగా తదితర క్రీడల్లో పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. విజేతల్ని నియోజకవర్గ పోటీలకు పంపిస్తామన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.అప్పన్నదొర, పాఠశాల కమిటీ చైర్మన్ మళ్ల కిషోర్, వైస్ చైర్మన్ ముచ్చకర్ల లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకులు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, సూరిశెట్టి అచ్చింనాయుడు, వివిధ పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం: రావికమతం హైస్కూల్లో బాలికల క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. అండర్-14, అండర్-17 విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలకు పలు హైస్కూళ్ల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థినులు హాజరయ్యారు. స్కూల్ కమిటీ చైర్మన్ కొసిరెడ్డి ప్రసాద్, హెచ్‌ఎం మల్లిఖార్జునరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ లక్ష్మణరావులు పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను రావికమతం హైస్కూల్లో నిర్వహించారు. త్రోబాల్, బాల్‌బాడ్మింటన్ పోటీలను టి.అర్జాపురం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ లక్ష్మణరావు తెలిపారు.

రోలుగుంట: స్కూల్ గేమ్స్ నిర్వహణలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో క్రీడాపోటీలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చూపారు. జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ సైతం వాలీబాల్ పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆయా పాఠశాలల పీఈటీలు అంపైర్లుగా వ్యవహరించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎంఈవో జానుప్రసాద్ సూచనల మేరకు హెచ్.ఎం.వరప్రసాద్ మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. శనివారం కూడా ఈ పోటీలు కొనసాగనున్నాయి. మండలస్థాయిలో ఎంపికైన విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నారు.

కె.కోటపాడు: క్రీడలు విద్యార్థుల్లో మానసికోల్లాసాన్ని, శారీరక ఆరోగ్యాన్ని కలిగిస్తాయని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి బాలుర క్రీడా పోటీలు స్థానిక హైస్కూల్లో హెచ్‌ఎం పద్మావతి పర్యవేక్షణలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ పావురాలను గాల్లోకి ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ చూపితే ఉన్నత చదువు, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు మెరుగవుతాయన్నారు. 210 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని నియోజకర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ ఆర్.లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీలు వేచలపు దొరబాబు, రొంగలి వెంకటరమణ, చీపురపల్లి అచ్చిబాబు, వర్రి రామునాయుడు, బొడ్డు రవి, చల్ల మంగ, సీనియర్ ఉపాధ్యాయుడు బోకం ఎర్రునాయుడు, పీడీలు త్రినాథ్‌రాజు, రోహిణి, దేముళ్లు, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రావికమతంలో రెండు రోజులుగా నిర్వహించిన ఆటల పోటీలలో ప్రతిభ చూపిన 200 మంది విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పైల లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా అండర్-14, 17 విభాగాల్లో పోటీలను నిర్వహించి కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లను ప్రకటించారు. అథ్లెటిక్స్ పోటీలను శనివారం నిర్వహించి, విజేతలను ప్రకటిస్తామని లక్ష్మణరావు వెల్లడించారు. విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

చిన్నారికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్ష మంజూరు



చెక్కును అందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రోలుగుంట: బుచ్చింపేట గ్రామానికి చెందిన రెండు నెలల చిన్నారి గుండె శస్త్రచికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును ఆ చిన్నారి తండ్రి అల్లు అర్జునకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం అందించారు. గ్రామానికి చెందిన అర్జున, లీల దంపతుల రెండు నెలల కుమారుడికి గుండెలో సమస్య ఏర్పడింది. దీనికి ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఉలబాల చంద్ర విప్ ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన తక్షణమే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష విడుదల చేయించారు. శుక్రవారం తన కార్యాలయంలో బాలుడి తండ్రికి అందించారు. తన కుమారుడి వైద్యానికి సహకరించిన ధర్మశ్రీకి, సర్పంచ్ దంపతులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సత్యవరం గ్రామ సభ విజయవంతం



గ్రామసభలో మాట్లాడుతున్న సచివాలయ కార్యదర్శులు

మాడుగుల: మండలంలోని సత్యవరం గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోతే వలంటీర్‌లు ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, విశాలాక్షిలు తెలిపారు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.46 లక్షలతో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ శివారు గొళ్లపేటలో మంచి నీటి పథకానికి రూ.25 లక్షలు మంజూరైందన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా వారం రోజుల్లో 1,200 సర్టిఫికెట్స్ అందించామన్నారు. గ్రామంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని గ్రామస్తులు సభ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి రామారావు, ఉపసర్పంచ్ వొమ్మలి పెంటయ్య, మాజీ ఉపసర్పంచ్ శనివాడ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జనపరెడ్డి అప్పారావు, గెంజి గోపాలకృష్ణ, గోకేడ ఈశ్వరరావు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి విజయ్‌కు లేదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, తదితరులు

మాకవరపాలెం: నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను విమర్శించే స్థాయి అయ్యన్న తనయుడు విజయ్‌కు లేదని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం టీడీపీ నిరసనలో విజయ్ చేసిన విమర్శలను ఖండించారు. ఎమ్మెల్యే స్థానికుడు కాదని చెప్పే మీరు, ఎక్కడి నుంచి వచ్చారో గుర్తుపెట్టుకోవాలన్నారు. మరో ఆరు నెలల్లో ప్రజలు మీ సొంత ఊరు అల్లిపూడికి పంపిస్తారని జోస్యం చెప్పారు. హైదరాబాద్‌లో ఉండే విజయ్ ఎన్నికలు సమీపిస్తుండటంతోనే ఇక్కడ ఏవో మీటింగ్‌లు పెడుతున్నారని ఆరోపించారు. సొంత చిన్నాన్న కారులోనే వాయిస్ రికార్డర్ పెట్టి, బ్లాక్‌మెయిల్ చేసిన విజయ్ గురించి ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. నర్సీపట్నంలో ప్రజలు, వ్యాపారుల కోరిక మేరకు రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయిస్తే, ఓర్పు లేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, పార్టీ నేత పెట్ల భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

శిథిల పోలింగ్ కేంద్ర భవనాల మార్పు



పెదగొలుగొండపేట సర్పంచ్ వెంకటరమణతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్ నాయుడు

నాతవరం: మండలంలో శిథిల భవనాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్త భవనాల్లోకి మార్చనున్నట్లు తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్ నాయుడు తెలిపారు. మండలంలోని గుమ్మడిగొండ, పెదగొలుగొండపేట, సీహెచ్‌బీబీ అగ్రహారం, ఎంబీ పట్నం శివారు ఎ.శరభవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను స్థానికంగా ఉన్న పలు పార్టీల నాయకులు ఆయనకు చూపారు. వాటిని కొత్త భవనాల్లోకి తరలించకపోతే ఓటేసేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 65 పోలింగ్ కేంద్రాలుండగా, వాటిలో నాలుగు పోలింగ్ కేంద్రాలు నిర్వహించే పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలు, నర్సీపట్నం ఆర్డీవో సూచనల మేరకు వాటిని కొత్త భవనాల్లో మార్చనున్నట్లు తెలిపారు. వాటిని ఆర్డీవో స్వయంగా పరిశీలించి ఖరారు చేస్తారన్నారు. ఇంటింటా ఓటర్ల సర్వే శత శాతం పూర్తి చేశామని, ఇందుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బూత్ ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు.


కెరీర్ గైడెన్స్‌తో పోటీ పరీక్షల్లో రాణింపు



విద్యార్థులతో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ గోపాలరావు

నర్సీపట్నం: ఇంటర్మీడియట్ స్థాయిలోనే ఉపాధికి బాటలు వేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎ.గోపాలరావు విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను దత్తత తీసుకుని క్లబ్ ద్వారా అనేక సదుపాయాలు కల్పించామన్నారు. డిజిటల్ గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. చదువుతో పాటు ఏదో ఒకరంగంలో విద్యార్థులు శిక్షణ తీసుకుంటే కళాశాల విద్య పూర్తి చేసుకున్న వెంటనే ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై పట్టుసాధించాలన్నారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ డి.రాఘవేంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.చిన్నారావు, క్లబ్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మూర్తి

మాకవరపాలెం: అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని విశాఖపట్నం ఎస్‌ఎస్టీఎల్ వార్‌షిప్ టెక్నాలజీ డైరెక్టర్ కెప్టెన్ మూర్తి అన్నారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక, సమయ పాలన, కష్టపడే తత్వం ఉంటే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ విభాగం జనరల్ మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక దేశంలోని అన్ని రంగాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు విశ్వేశ్వరయ్య కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరకులో పసుపు ఆకు తెగులు నివారణకు సూచనలు



చెరుకు సాగుపై రైతుకు సలహాలిస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: చెరకు పంటలో తీగజాతి గడ్డి ద్వారా సోకే పసుపు ఆకు తెగులు నివారణకు ఆల్ మిక్సర్ గడ్డి మందును పిచికారీ చేయాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ రైతులకు సూచించారు. ఈ మేరకు వేచలంలో మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మతో కలిసి చెరకు పంటను శుక్రవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన వేచలపు సింహాద్రప్పడు చెరకు తోటలో ఆకులు పసుపు రంగులో మారి, ఎండి పోవటాన్ని గుర్తించారు. ఆరు నెలలు దాటిన చెరకు తోటలో తీగజాతి గడ్డిలో 8 గ్రాముల ఆల్ మిక్సర్ గడ్డి మందును 200 లీటర్ల నీటిలో కలిపి, పిచికారీ చేయడం ద్వారా పసుపు ఆకు తెగులును నివారించవచ్చన్నారు. చెరకు పంటలో రెండు నెలలకోసారి ఎకరానికి 50 కిలోల పొటాష్‌తో పాటు, సూక్ష్మ పోషకాల రూపంలో మల్టీ-కే ఎకరానికి కేజీ చొప్పున పిచికారీ చేయాలన్నారు. తద్వారా పంటలకు బలం చేకూరి తెగుళ్లు సోకే అవకాశం ఉండదని రైతులకు వివరించారు. చెరుకు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛతా పక్వాడా



చిత్ర ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్: మండలంలోని గవరవరం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం స్వచ్ఛతా పక్వాడా ముగింపు కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పక్షం రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల పోటీలలో విజేతలకు సైన్సు టీచర్ ఏఎస్ కృప బహుమతులు అందించారు. ముగింపు రోజున విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, మంచినీటి సద్వినియోగం, ప్లాస్టిక్ నిషేధంపై ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన ఆకట్టుకుంది.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం



ఈశ్వరరావును సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంఈవోలు

కె.కోటపాడు: అంకిత భావంతో ఉపాధ్యాయ వృత్తిని నిర్వహిస్తూ, సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈశ్వరరావు పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. కె.కోటపాడు హైస్కూల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఆయన ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవాన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం స్కూల్లో ప్రజాప్రతినిధులు, సహచర సిబ్బంది ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన బోధనను అందిస్తున్న ఈశ్వరరావు, గిరిజన ప్రాంత గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు, నిరుద్యోగులకు పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్, పేదలకు ఆర్థిక సాయం అందిస్తూ నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. దుశ్శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, హెచ్‌ఎం పద్మావతి, సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, చీపురుపల్లి అచ్చిబాబు, రొంగలి వెంకటరమణ, వర్రి రామునాయుడు, ఉపాధ్యాయులు బోకం ఎర్రునాయుడు, మురళీకృష్ణ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు వందనం



ఇంజినీర్లను సత్కరిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

చోడవరం రూరల్: ఇంజినీర్స్ డే సందర్భంగా శుక్రవారం వాసవి క్లబ్, వాసవీ వనితా ఆధ్వర్యంలో పలువురు ఇంజినీర్లను సత్కరించారు. దేశ పురోభివృద్ధి, పునర్నిర్మాణంలో ఇంజినీర్ల సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. పలు విభాగాలలో ఇంజినీర్లుగా సేవలు అందిస్తున్న జయరాం, పి.వి.నర్సింగరావు, గోపి, యగ్నేష్‌బాబులను సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పుట్టా నరేష్, కోశాధికారి భోగవిల్లి గణేష్, క్యాబినెట్ కార్యదర్శి ఎస్.మధు, పీఎస్‌వీ లక్ష్మణరావు, కలగర్ల తాతాజీలు పాల్గొన్నారు.